సమ్మర్ క్యాంప్.. సత్ఫలితం

వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ఈనెల 1న ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో వేసవి శిబిరాలు (సమ్మర్ క్యాంపులు) ఏర్పాటు చేసింది. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ శిబిరాలు రేపటితో ముగియనున్నాయి. విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించేందుకు యోగా, సూర్యనమస్కారాలతో పాటు ధ్యానంపై శిక్షణ ఇస్తున్నారు. చెస్, క్యారం, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్ తయారీ, కబడ్డీ, ఖోఖో, డంబెల్స్, స్కిప్పింగ్ తదితర ఆటలతో పాటు చందమామ కథలు చదివించడం, రాయించడం చేస్తున్నారు. వీటితో పాటు విద్యార్థులకు వివిధ రకాల నృత్యాలు కూడా నేర్పిస్తున్నారు. సామాజిక అంశాలపై విద్యార్థుల మధ్య డిబేట్ సైతం నిర్వహిస్తున్నారు. కాగా సమ్మర్ క్యాంపు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో పాఠశాలకు రూ.50 వేలు విడుదల చేసింది.

– కెరమెరి


స్కిప్పింగ్ ఆడిస్తున్న శిక్షకురాలు


డంబెల్స్ ఆడుతూ..


నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థినులు


చెస్ ఆడుతున్న విద్యార్థులు


క్యారంబోర్డు నేర్పిస్తున్న శిక్షకురాలు

శుభప్రయాణం కారాదు విషాదం

- శుభకార్యాలకు వ్యాను, బొలెరోల్లో ప్రయాణం
- పరిమితికి మించి వెళ్తున్న జనం
- ప్రమాదాలు జరిగే అవకాశం
- చోద్యం చూస్తున్న అధికారులు


చింతలమానెపల్లిలో బోల్తాపడిన పెళ్లి బొలెరో వాహనం (ఫైల్)

కౌటాల: ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. జిల్లాలో జరుగుతున్న వివిధ శుభకార్యాలకు వెళ్లేందుకు బంధువులు, కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. శుభకార్యాలకు ప్రైవేట్ వ్యాను, బొలెరో వాహనాల్లో భారీ సంఖ్యలో వెళ్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదమని తెలిసినా ప్రైవేట్ వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను శుభకార్యాలకు తరలిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ప్రైవేట్ వాహనాల్లో..

ఏటా వేసవికాలంలో అధికంగా పలు శుభకార్యాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా పెళ్లి కార్యాలు ఎండాకాలంలో అధికంగా ఉంటాయి. చాలా మంది మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు తమ బంధువులను పెళ్లికి తరలించేందుకు వ్యాను, బొలెరో, ట్రాక్టర్లు, లారీలు ఇతర ప్రైవేట్ స్కూల్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. అయితే వీటిలో పరిమితికి మించి ప్రయాణిస్తుండడంతో ఏదైనా ప్రమాదం సంభవిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ప్రైవేట్ వాహనాల్లో శుభకార్యాలకు వెళ్తూ పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు జిల్లాలో చాలానే ఉన్నాయి. శుభకార్యాలకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినా, ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవడం లేదు.

ఏటా ప్రమాదాలు

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా శుభకార్యాలకు ప్రైవేట్ వాహనాలను వినియోగిస్తున్నారు. దీంతో ఏటా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు డ్రైవర్లు తమ వాహనాల్లో కిక్కిరిసేలా మహిళలు, వృద్ధులు, పిల్లలు, యువకులను ఎక్కించి శుభకార్యాలకు తరలిస్తున్నారు. ఏప్రిల్ 29న చింతలమానెపల్లి మండలం కోయపెల్లి గ్రామం సమీపంలో శుభకార్యానికి వెళ్లి వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీ కొట్టడంతో అందులోని 9 మంది ట్రాక్టర్ కింద చిక్కుకోవడంతో స్థానికులు పోలీసుల సహకారంతో ట్రాక్టర్ కింద చిక్కుకున్న వారిని బయటకు తీశారు. ఇలాంటి సంఘటనలు ఏటా జిల్లాలో పలు చోట్ల జరుగుతున్నాయి.

జాడలేని తనిఖీలు

వందల కొద్ది మంది లారీల్లో, వ్యానుల్లో, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించిన సందర్భాల్లో రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేసి సంబంధిత వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అయినా అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు.

అవగాహన కల్పించాలి

శుభకార్యాలకు ప్రైవేట్ వాహనాలు తక్కువ కిరాయికి రావడంతో గ్రామీణ ప్రజలు ఎక్కువగా వాటినే ఆశ్రయిస్తున్నారు. అనుభవం లేని వారు నడుపుతుండడంతో రోడ్డు ప్రమాదాలు బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు ఆర్టీసీ ప్రయాణంపై, ఆర్టీసీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ వాహనాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– విజయ్, గుండాయిపేట

చేతిపంపు బాగు చేసేదెవరు?


చెడిపోయిన చేతిపంపు

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చేతిపంపులు చెడిపోయి తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గత ఎనిమిది రోజుల క్రితం చేతిపంపు చెడిపోవడంతో పాటు మిషన్ భగీరథ నీరు సైతం సరఫరా కాకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి అధికారులకు విన్నవించినప్పటికీ మరమ్మతులు చేపట్టలేదన్నారు. మండుటెండలతో భూగర్భ జలాలు అడుగంటుతున్న వేళ తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేతిపంపులకు మరమ్మతులు చేయడంతో పాటు మిషన్ భగీరథ నీరు మండలంలో సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


పరీక్ష నిర్వహిస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: మద్యం తాగి వాహనాలు నడిపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే క్రమంలో ఏదైనా ప్రమాదాలు జరిగితే కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఆటో, కారు, ట్రాక్టర్ తదితర వాహనాలను మద్యం సేవించి నడపకూడదని సూచించారు. అతివేగం కూడా పనికిరాదని తెలిపారు. వాహనదారులు వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన ఒకరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'కార్మికులను ఆందోళనకు గురి చేయొద్దు'


సీహెచ్‌పీ ఎస్ఈకి వినతిపత్రం అందించి సమస్య వివరిస్తున్న కార్మికులు

రెబ్బెన: అటెండెన్స్ విషయంలో ఏరియాలో ఎక్కడా లేని విధంగా గోలేటి సీహెచ్‌పీలో బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు నిబంధనలు విధిస్తూ ఆందోళనలకు గురి చేయడం సరికాదని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మికుల సంఘం ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. సీహెచ్‌పీలో పని చేసే బెల్ట్ క్లీనింగ్ కార్మికులతో కలిసి సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీలో పనిచేస్తున్న బెల్ట్ క్లీనింగ్ కార్మికులు ఒక్కరోజు విధులకు గైర్హాజరైతే జరిమానా విధిస్తామని కార్మికులను ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. పర్మినెంట్ కార్మికుల మాదిరిగా బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు ఎలాంటి సెలవులను యాజమాన్యం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. జీతంతో కూడిన వారాంతర సెలవులు లేనప్పటికీ నెలలో 26 రోజులు విధులకు హాజరు కావాలంటూ కొత్త నిబంధనలు పెడుతున్నారన్నారు. తక్కువ వేతనానికే పని చేస్తున్న బెల్ట్ క్లీనింగ్ కార్మికులు అత్యవసర పరిస్థితిలో మాత్రమే విధులకు గైర్హాజరవుతారనే విషయాన్ని అధికారులు గుర్తించడం లేదని పేర్కొన్నారు. కార్మికులు జరిమానా కట్టేందుకు నిరాకరిస్తే వారి స్థానంలో కొత్త వారిని నియమించుకుంటూ కార్మికుల కడుపు కొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నెల చివర్లో మస్టర్లను సరిచేసి కార్మికులకు జరిమానా పడకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు సందీప్, సురేందర్, జాఫర్, శ్రీశైలం, వెంకటేశ్, సత్తయ్య, జాడిబాబు, కుమార గోపాల్, మహేశ్, భీమేశ్‌లు పాల్గొన్నారు.

గ్రంథాలయం కోసం భవనం పరిశీలన


భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: మండల కేంద్రంలో గ్రంథాలయం కోసం స్థానిక పాత గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌటాల గ్రంథాలయం గత 30 ఏళ్లుగా శిథిల భవనంలో కొనసాగుతుందని, రానున్న వానాకాలంలో పాత భవనంలో గ్రంథాలయం నిర్వహించడం సాధ్యం కాదన్నారు. పాత మహిళా శిశు సంక్షేమ భవనానికి మరమ్మతులు చేపట్టి గ్రంథాలయాన్ని ఇక్కడికి మార్చుతామని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో రమేశ్, ఏపీవో మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతిరాం, నాయకులు మిథున్, భూమయ్య, మధుకర్, తిరుపతి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రైతులు వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించొద్దని, ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. అధికారులు పకడ్బందీగా కొనుగోళ్లు చేపట్టాలని, కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తుందని తెలిపారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఏడీఏ మనోహర్, ఎంపీడీవో రమేశ్, ఏవో ప్రేమలత, సీఈవో రాజేశ్, పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు విజయ్, ఏఈవోలు పాల్గొన్నారు.

దేవతలకు జలాభిషేకం



కెరమెరి: వానదేవుడు కరుణించాలని, గ్రామంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, పంటల్లో దిగుబడులు రావాలని మండలంలోని గోయగాం గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం ఊరి దేవతలకు జలాభిషేకం చేశారు. అనంతరం గ్రామ పొలిమేరలో ఉన్న పోచమ్మ తల్లితో పాటు పులాజీబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మతల్లి, పులాజీబాబా ధ్వజస్తంభానికి జలాభిషేకం చేశారు. మహిళలు మౌనిక, భూదేవి, కల్యాణి, మహేశ్వరి, లావణ్య, రేష్మ, అణిత, మంజూష, సౌజన్య, కౌసల్య, అంజలి ఉన్నారు.

ఏజెన్సీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

నార్నూర్: ఏజెన్సీ చట్టాలను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని, లేకపోతే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతం బాలు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

అదుపు తప్పితే.. అంతే సంగతి!



రెబ్బెన: రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు సురక్షితమైన ప్రయాణం కోసం నేషనల్ హైవే నిర్మాణం చేపట్టారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతీ అంశాన్ని ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు నిర్మాణం చేపడుతారు. అయితే రెబ్బెన మండలంలోని పల్లవీ పోటరీస్ వద్ద జాతీయ రహదారి పక్కనే పెద్ద బావి ఉన్నప్పటికీ దాన్ని పూడ్చివేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలు దాదాపు 100 కి.మీ వేగంతో వెళ్తుంటాయి. ఈ సమయంలో ప్రమాదవశాత్తు ఏ వాహనమైన అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బావిలో పడితే పరిస్థితి ఏంటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ బావికి మోటార్‌ను ఏర్పాటు చేసి నీటిని ఫ్యాక్టరీ అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన అజ్మెర కుమార్‌కు రూ.7500, ఎల్కపల్లి గ్రామానికి చెందిన రాచకొండ మమతకు రూ.60వేలు, పోతెపల్లి గ్రామానికి చెందిన తెలిగే పెంటక్కకు రూ.19500, పెంచికల్‌పేట్ గ్రామానికి చెందిన రౌతు సుగుణకు రూ.12వేలు, అవునూరి కమలకు రూ.24వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా మంగళవారం బీజేపీ నాయకులు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నగేశ్, మధుకర్, వెంకన్న, భాస్కర్, ప్రభాకర్, సాయి, హరీశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న శివరాం నాయక్

లింగాపూర్: మండలంలోని పలు ఆలయాల్లో తాగునీరు అందుబాటులో లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆలయాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దండే విఠల్‌కు మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం ఉపాధ్యక్షుడు భుక్యా శివరాం నాయక్ వినతిపత్రం అందజేశారు. గోపాల్‌పూర్, ఎల్లాపటార్, లోద్దిగూడ, జాములీధరా, కంచన్‌పల్లి, చోర్‌పల్లి, లింగాపూర్‌లలో ఉన్న ఆలయాల్లో తాగునీటి సౌకర్యం లేదన్నారు. ఎమ్మెల్సీ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు.

ఉపాధి కూలీలు పని దినాలు సద్వినియోగం చేసుకోవాలి


కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: ఉపాధిహామీ కూలీలు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కౌటాల ఎంపీడీవో రమేశ్ అన్నారు. మండలంలోని సాండ్‌గాం గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు రోజువారీ వేతనం గిట్టుబాటయ్యే విధంగా పని కల్పించాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. కూలీలు నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని తెలిపారు. జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ వంద రోజుల పని దినాలు పూర్తి చేయాలని తెలిపారు. రైతులు చేనుల్లో ఉపాధిహామీ పనులు చేయించాలని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలన్నారు. ఉదయం పని ప్రదేశానికి వచ్చి ఎండ వేడిమి పెరగక ముందే పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఏపీవో మహేందర్‌రెడ్డి, ఈసీ సంతోష్, టీఏలు, తదితరులు ఉన్నారు.

టీఫైబర్‌పై సమీక్ష


మాట్లాడుతున్న డీఎం వెంకటేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్యక్రమంలో చేపడుతున్న టీఫైబర్ సేవలపై మంగళవారం జిల్లా కేంద్రంలో కేబుల్ ఆపరేటర్లతో డీఎం వెంకటేశ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్ల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ ఇంటర్నెట్ అందించనుందని తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వివిధ మండలాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతులు

దహెగాం: ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్యాడీ మిషన్ ద్వారా తూర్పార పడుతుండగా విద్యుత్ షాక్ తగిలి ఇద్దరు రైతులు అస్వస్థతకు గురయ్యారు. మండల కేంద్రానికి చెందిన ఎల్కరి బాపాజీ, ఎల్కరి దామోదర్ మంగళవారం ప్యాడీ క్లీనర్ యంత్రం ద్వారా ధాన్యాన్ని తూర్పార పడుతుండగా మిషన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యారు. పక్కనే ఉన్న రైతులు గమనించి వెంటనే వారిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పెను ప్రమాదం తప్పడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

ఆసిఫాబాద్‌రూరల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని అడ గ్రామానికి చెందిన బామ్నే గణేశ్ (35) మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. దీంతో అతని భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపానికి గురైన గణేశ్ సోమవారం రాత్రి ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం తల్లి భూదేవి చూసి స్థానికులకు తెలపడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భూదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.